జిల్లాలో ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ పర్యటన

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ఈనెల 17,18 తేదీలలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా ఆయన 17వ తేదీ ఉదయం హెచ్‌పీసీఎల్ అతిథి గృహం నుండి బయలు దేరి 11 గంటలకు మిందిలోని బీహెచ్ఎల్ ప్లాంటును సందర్శించి, అక్కడ ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3గంటలకు అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు జిల్లా అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షిస్తారు. రాత్రికి హెచ్ పిసిఎల్ అతిథి గృహంలో బస చేస్తారు. 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు హెచ్పీసీఎల్ రిఫైనరీ ప్లాంటును సందర్శించి అక్కడి సీనియర్ అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు విశాఖపట్నం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్, సీపీ, జిల్లా అధికారులతో సమీక్షిస్తారు. 18వ తేదీ హెపిసిఎల్ అతిథి గృహంలో రాత్రి బస చేస్తారు. 19వ తేదీ సాయంత్రం ఆయన విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు.

విద్యుత్తు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

సీపీఐ ఆధ్వర్యంలో పూర్ణామార్కెట్‌లో కరపత్రాల పంపిణీ, ధర్నా

విశాలాంధ్ర-విశాఖ : విద్యుత్తు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో పూర్ణా మార్కెట్‌లో బుధవారం కరపత్రాల పంపిణీ జరిగింది. పార్టీ కార్యకర్తలు ఇళ్లకు, దుకాణాలకు వెళ్ళి స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఛార్జీల గురించి ప్రజలకు వివరించారు. కరెంటు చార్జీలను పెంచే ఆలోచనను విరమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మధరావు, సి.ఎన్. క్షేత్ర పాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అదానీ చేసుకున్న సోలార్ విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ఛార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను విరమిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై కరెంటు ఛార్జీల భారాన్ని విపరీతంగా మోపడానికి సిద్ధమవడాన్ని ప్రజలు సహించరని అన్నారు. గత ప్రభుత్వం అనేకసార్లు కరెంటు ఛార్జీలను పెంచడంతో ఇప్పటికే ప్రజలపై విపరీతమైన భారాలు పడ్డాయని అన్నారు. ఇప్పుడు మరింతగా భారాలు మోపడానికి సిద్ధమవుతున్నారని, వాటిని తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అదానీతో చేసుకున్న ఒప్పందం వల్ల 25 సంవత్సరాలు పాటు ప్రజలపై 1.10లక్షల కోట్లు భారం పడుతుందని తెలిపారు. ఏడాది కాలంలో విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు పేరుతో రూ.15,486 కోట్ల మేర ప్రజలపై భారం వేసిందని తీవ్రంగా విమర్శించారు. పేద ప్రజల కడుపులు కొట్టే ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని తెలిపారు. ప్రజలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ మేస్త్రిలు జి.సూరిబాబు ఎ.పైడిరాజు, బి.సాంబయ్య, ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలంటూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేయడమైనది 61 వ వార్డు మల్కాపురం పరిధిలోని మల్కాపురం సబ్ స్టేషన్ ఎదుట నిర్వహించిన కార్యక్రమానికి సిపిఐ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేగుల సత్య ఆంజనేయ పాల్గొని మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం సామాన్య మధ్యతరగతి వర్గాలపై దండయాత్రలు మొదలుపెట్టింది విద్యుత్ ధరల రూపంలో బాదుడే బాదుడు మొదలుపెట్టిందని విద్యుత్ బిల్లులను చూస్తేనే సొగు కొడుతున్నాయి అదనపు చార్జీలు రద్దు చేయాలని మరియు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిపిఐ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, ఎన్.వి.త్రినాథ్, వై.కనకేశ్వర్‌రావు, కే.శ్రీనివాసరావు మహిళా సంఘ నాయకులు గుడాల జయ, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆసుపత్రిలో ఆర్టీసీ ఎండీ తనిఖీలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు విశాఖపట్నంలో ఉన్న ఎంవిపి డిస్పెన్సరీ బుధవారం తనిఖీ చేపట్టారు. ఈ హాస్పటల్లో ఉన్న సిబ్బంది యొక్క మెడికల్ ఫెసిలిటీస్ వసతులు, మెడికల్ ల్యాబ్స్, డాక్టర్ల మెడికల్ ట్రీట్మెంట్లు పరిశీలించి ఆధునికరణ చేయుటకు ఎంవీపి బస్ స్టేషన్లో ఎటువంటి కొత్త పరికరాలు కావాలి అని పరిశీలించి వాటి మీద నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశాలు జారీ చేశారు. ఎంవి పీ బస్ స్టేషన్ లో ఉన్న వసతులు అన్ని పరిశీలించారు. మరింత శుభ్రంగా మైంటైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిట్ డైరెక్టర్ కే.యస్.బి.రెడ్డి, రీజినల్ మేనేజర్ విశాఖపట్నం బి అప్పలనాయుడు, డెప్యూటీ సిటీఎంలు సత్యనారాయణ, శ్రీమతి పద్మావతి, విశాఖపట్నం సీనియర్ మెడికల్ ఆఫీసర్లు శ్రీమతి వాణి నీలిమ, ఆశా కిరణ్, విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ దుర్గాప్రసాద్, డీ ఈ నరసింహారావు, వివిధ అధికారులు పాల్గొన్నారు.

పార్టీ ఫిరాయింపు కార్పొరేటర్లకు షాక్...

టిడిపి, జనసేన, బిజెపిలోకి ఫిరాయించిన వైసీపీ కార్పొరేటర్లకు నోటీసులు..

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జీవీఎంసీ మేయర్ ఎన్నికల్లో వైసీపీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసిన 27మంది కార్పొరేటర్లుకు జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో కలెక్టర్ పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లపై అనర్హత వేటు వేయాలని కలెక్టర్‌కు వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విప్ తైనాల విజయ కుమార్ ఫిర్యాదు చేయడంపై చర్యలు మొదలు పెట్టారు. మేయర్ పదవికి కూటమి కార్పొరేటర్లు పోటీ పడిన నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు 27మంది కూటమి పార్టీల్లో చేరి కూటమి అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావును గెలిపించారు. 4 యేళ్ళు పాటు వైసీపీ మేయర్‌గా గొలగాని హరి వెంకట కుమారి కొనసాగారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో అనేక మున్సిపాల్టీలో పాలక వర్గాల మార్పు చోటు చేసుకున్న నేపథ్యంలో జీవీఎంసీలకు కూడా మెజారిటీ సభ్యులు కలిగిన వైసిపి పాలకవర్గం నుండి కూటమి ప్రభుత్వం గ్రేటర్ విశాఖ మేయర్ పీఠం దక్కించుకోవాలని చేసిన క్యాంప్ రాజకీయాల నేపథ్యంలో వైసీపీ కి చెందిన 27 మంది కార్పొరేటర్లు వివిధ పార్టీల చేరి కూటమి మేయర్ కు మద్దతు తెలపడంతో వైసీపీ అధినేత జగన్ సిఫార్సుతో ఆ పార్టీ నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వారిపై అనార్హత వేటు వేయాలని కోరారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ వారికి నోటీసులు జారీ చేశారు.

కలిసే గెలిచాం... కలిసే పనిచేస్తున్నాం... కలిసే ఉంటాం

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల సంచలన వ్యాఖ్యలు

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కాలంలో కూటమి పార్టీలలో చోటు చేసుకున్న పరిణామాలు, మిత్రుల నుండి వస్తున్న విమర్శలకు కౌంటర్‌గా అన్నట్లు నర్మగర్భంగా హెచ్చరికలు జారీ చేశారు. పెందుర్తి మండలం పినగాడి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే, టిడిపి సీనియర్ నేత బయలపూడి హరగోపాల్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ గతి ఎన్నికల్లో కలిసే పోటీ చేసాం.. కలిసే పని చేస్తున్నాం... కలిసే ఉంటాం, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నరేంద్ర మోడీ చరిష్మాతోనే పెందుర్తి నియోజకవర్గంలో తిరుగు లేని మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు స్పష్టం చేశారు. అంతేతప్ప ఏ ఒక్కరు దయతోనో శక్తితోనో ఈ గెలుపు సాధ్యం కాలేదని పరోక్షంగా కూటమిలోని కొందరు నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. పెందుర్తి నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి కావాలో అక్కడ చేసి చూపించడమే తనకున్న ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. కూటమిలోని అన్ని పార్టీల కార్యకర్తలు తనకు ఒకటేనని, అభివృద్ధి కావాలంటూ ఎవరు తన వద్దకు వచ్చినా ఎదురెల్లి వారి పని పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఏడాదిలో 229 కోట్లతో అభివృద్ధి చేయగలగడానికి ఏ ఒక్క పార్టీయో కారణం కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో చిచ్చు పెట్టడానికి కొంతమంది వ్యక్తులు, పార్టీలు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి సహకారంతో, అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలతో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో రాష్ట్రం సర్వతో ముఖ అభివృద్ధి చెందుతున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల వ్యాఖ్యలు పెందుర్తి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి.

గంగవరం పోర్టు-హైవే లింక్ రోడ్డుకు నేషనల్ హైవే చైర్మన్ పచ్చజెండా

విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు వినతిపై సానుకూల స్పందన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల పునరుద్ధరణలో ఓ కీలక మలుపు తిరిగింది. విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బుధవారం న్యూఢిల్లీలోని ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను కలిసి, గంగవరం పోర్ట్-ఎన్ఎచ్ఎ-16 తుంగ్లాం మార్గం రహదారి ప్రాజెక్టుకు తక్షణ ఆమోదం కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. వీరి వెనకనే నేషనల్ హైవే చైర్మన్ సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం సమగ్రంగా డీపీఆర్ సిద్ధమై ఉన్నప్పటికీ, గత ప్రభుత్వ విధ్వంసకర పాలనవల్ల ఈ ప్రాజెక్టు ప్రతిపాదన ఫైళ్లకే పరిమితమై, కార్యరూపం దాల్చకపోవడంపట్ల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జాప్యం వల్ల పోర్ట్‌కు అనుసంధాన మార్గం అందక, ట్రాఫిక్ సమస్యలు పెరిగి, నగర అభివృద్ధికి ఆటంకమవుతోందని వివరించారు. గంగవరం పోర్టు ద్వారా ట్రక్కుల రాకపోకలు రోజుకు 2,500 నుంచి 6,000 వరకు పెరగనున్న నేపథ్యంలో, ప్రస్తుతం గాజువాక 4 లేన్ మార్గం పూర్తిగా ఓవర్‌లోడ్ అయిందని వారు తెలిపారు. పారిశ్రామిక భూములు, రైల్వే భూముల మీదుగా కొత్తగా ప్రతిపాదిత అలైన్‌మెంట్ వెళ్ళడం వల్ల భూస్వాధీనం సంబంధిత సమస్యలు గణనీయంగా తగ్గుతాయని, ఈ మార్గం దీర్ఘకాలికంగా వ్యవహరించదగ్గ పరిష్కారమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నేతలు మరో కీలక విషయాన్ని కూడా ఎన్‌హెచ్ఏఐ దృష్టికి తీసుకెళ్లారు. విశాఖ నగరం-పోర్ట్-భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ మధ్య గ్రేడ్ సెపరేటెడ్ ఫ్లైఓవర్లతో కూడిన రహదారి విస్తరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల నగర ట్రాఫిక్‌కు ఉపశమనం లభించి, విశాఖపట్నం లాజిస్టిక్, ఏవియేషన్ హబ్‌గా ఎదగడానికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ అభివృద్ధికి అడ్డుగానే నిలిచిన కీలక అంతరాయాలను తొలగించేందుకు తక్షణ చర్యలు అవసరమని హితవు పలికారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే మార్గం దేశంలోని ఇతర గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలతో పోటీ పడే స్థాయిలో ఉండాలన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మౌలిక సదుపాయాల నిర్ణయాలు రాజకీయాల వల్ల ఆలస్యం కాకూడదు. టీడీపీ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై చొరవగా ముందుకు వెళ్లుతూ, వాటి అమలుకోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తున్నాం అని చెప్పారు. ఈ ప్రతిపాదనలపై ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ గత జాప్యాలను గుర్తించి, గంగవరం-ఎన్‌హెచ్ 16 రహదారి, భోగాపురం రహదారి రెండింటినీ అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటామని, త్వరితగతిన ఆమోద, ప్రణాళికలు పూర్తవుతాయని హామీ ఇచ్చారు.

జూలై 23న 4వ జోన్‌లో బహిరంగ వేలం నిర్వహణ

విశాలాంధ్ర-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 4వ జోన్‌లో పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, ఒక కళ్యాణ మండపం, ఒక మార్కెట్, మెయిన్ ఆఫీ కాంటీన్ నకు జూలై 23వ తేది ఉ.గం.11.00లకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగునని 4వ జోన్ జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జీవిఎంసి 4వ జోన్ (సూర్యబాగ్) పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయము, జగదాంబ వాణిజ్య సముదాయం, పాత బస్‌స్టాండ్ దుకాణాములు, పద్మనగర్ వాణిజ్య సముదాయం, సూర్యబాగ్ వాణిజ్య సముదాయం, టీ.ఎస్.ఆర్ వాణిజ్య సముదాయము, అంగడిదిబ్బ వాణిజ్య సముదాయాలలోని మిగిలిన దుకాణాలకు మరియు జీవిఎంసి మెయిన్ ఆఫీస్ కాంటీన్, అంబేద్కర్ కళ్యాణ మండపం, రెల్లివీధి రోడ్ సైడ్ ఫిష్ మార్కెట్లును 3 సంవత్సరముల కాల పరిమితికి గుత్తకు ఇచ్చేందుకు 23-07-2025 తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించబడునని జోనల్ కమిషనర్ తెలిపారు. సదరు వేలంపాటలో పాల్గొన దలచిన వారు దరావత్తు సొమ్ము తదితర పూర్తి వివరాలకు 4వ జోనల్ కార్యాలయం పని వేళలో పర్యవేక్షకులను సంప్రదించగలరని జోనల్ కమిషనర్లు తెలిపారు.

కార్మికోద్యమంలో దళితుల పాత్ర కీలకం

డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు జె.వి.ప్రభాకర్

విశాలాంధ్ర-పెదగంట్యాడ : కార్మికోద్యమంలో దళితుల పాత్ర కీలకమని దళిత హక్కుల పోరాట సమితి (డి.హెచ్.పి.ఎస్) రాష్ట్ర అధ్యక్షులు జె.వి.ప్రభాకర్ అన్నారు. బుధవారం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో ఉక్కు ఉద్యోగి జి.ఆనంద్ ఆత్మీయ సత్కార కార్యక్రమం ఘనంగా చేశారు. డి.హెచ్.పి.ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జె.వి.ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల జరిగిన దేశ వ్యాప్త సమ్మె లో 35 కోట్ల మంది పాల్గొన్నా రని ఇందులో 5 కోట్ల మంది దళితులు పాల్గొన్నారని అన్నారు. పరిశ్రమలు దళితుల ఆత్మ గౌరవమని, ఈ పరిశ్రమలను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటం కైనా సిద్ధమని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఆధునిక దేవాలయాలనీ, ఈ పరిశ్రమలను కాపాడుకోవడం కోసం పోరాటం చేస్తామని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం దళితులు అగ్ర భాగాన నిలుస్తారని అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం లో 34 సంవత్స రాల సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఆనంద్ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరు సాగించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ ను డి.హెచ్.పి.ఎస్ శ్రేణులు శాలువా, బొకెలతో ఘనంగా సత్కరించారు. పెద గంట్యాడ సీపీఐ శాఖా కార్యదర్శి పి. దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డి.హెచ్.పి.ఎస్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఎస్.రాజు, జి.రాంబాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యురాలు కె. వనజాక్షి, ఉక్కు ఏ. ఐ.టి.యూ.సి పూర్వ అధ్యక్షులు జి. బోసు బాబు, ఉక్కు ఎం ఈ ఎఫ్ అధ్యక్షులు పెట్ల వెంకట రమణ, ఏ.ఐ.వై.ఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి కె.అచ్యుత్‌రావు, సీపీఐ నాయకులు అప్పా రి విష్ణు మూర్తి, పిల్లా పద్మ, పి.దుర్గారావు, పల్లేటి పోలయ్య, ఆనంద్, దళిత నేతలు మండే సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సిపిఐ ప్రచారం

విశాలాంధ్ర-విశాఖ : విద్యుత్ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో పెదగదిలి జంక్షన్‌లో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం కోసం గత వైసీపీ ప్రభుత్వం అదానీ కంపెనీతో చేసుకున్న ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై 25 సంవత్సరాల పాటు రూ.1.10 లక్షల కోట్ల భారం పడుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు రద్దు చేయలేదని విమర్శించారు. సర్దుబాటు ఛార్జీలు పేరుతో ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలు రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిని ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, పైగా గడిచిన ఏడాది కాలంలో మూడుసార్లు సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.15,485 కోట్లు భారం మోపిందని విమర్శించారు. ఎన్నికల ముందు చంద్రబాబు విద్యుత్ ఛార్జీల పెంపును తీవ్రంగా వ్యతిరేకించారని అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని, అవసరమైతే పగలగొట్టాలని చెప్పారని గుర్తుచేశారు. స్మార్ట్ మీటర్లు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఏ.దేవుడమ్మ, సిహెచ్. కాసుబాబు, ఆరిలోవ ఏరియా కార్యదర్శి కే. లక్ష్మణరావు, ఏ.రవి, కె.సందీప్, బి.రాజు, రమణ, సోమబత్తుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : బుధవారం జీవీఎంసీ 7 వ వార్డు మల్లయ్యపాలెం, అయోధ్య నగర్ ప్రాంతాలలో సిపిఐ ఇంటింటి ప్రచారం ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఈ స్మార్ట్ మీటర్ల ఖరీదును వినియోగ దారులే భరించాలని, సింగిల్ ఫేజ్ మీటరు ఖరీదు రూ.8,927, త్రిఫేజ్ మీటరు ఖరీదు రూ.17,286. ఈ మొత్తాన్ని 93 నెలలు బిల్లుతో బాటు అదనంగా చెల్లించాల్సి వస్తుందన్నారు. విద్యుత్ వినియోగం ఎక్కువ ఉండే సమయాల్లో ఎక్కువ చార్జీ వసూలు చేస్తారని, వేసవి కాలంలో ఈ దోపిడీకి హద్దు ఉండదని, దీని ప్రభావం బిల్లులపై పడుతుందని తెలిపారు. ఉదాహరణకు ఇప్పుడు రూ? 500 వచ్చే బిల్లు రూ? 2,500 వరకూ పెరుగుతుందని, ఈ స్మార్ట్ మీటర్లు అన్నీ ప్రీ పెయిడ్ మీటర్లని, మనం సెల్ ఫోన్ మాదిరిగా ముందుగానే రీచార్జీ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పుడున్న మీటర్లు తీసేసి ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తే అందులో మనం చేసుకున్న రీచార్జి పూర్తవగానే మన ఇంటికి విద్యుత్ సరఫరా ఆగిపోతుందని, వాడుకున్న విద్యుత్‌కు బిల్లు చెల్లించడం కనుమరుగై ముందుగానే డబ్బులు చెల్లించాల్సి వస్తుందని, ఇప్పుడున్న మీటర్ల వలన మనం ఎన్ని యూనిట్ల కరెంటు వాడుకున్నామో, ఏ రేటు పడుతున్నదో తెలుస్తుందని, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లలో ఎన్ని యూనిట్లు వాడుకున్నామో, ఏ ధరకు లభిస్తున్నదో వినియోగదారులకు తెలియదని ప్రజలకు తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్ల ఖరీదుతో పాటు దాని రిపేరికి అయ్యే ఖర్చులు, అనుబంధంగా వాడే పరికరాల ఖర్చును కూడా వినియోగదారుడే భరించాలని, ఈ నేపథ్యంలో ఈ స్మార్ట్ మీటర్లు అన్ని విధాల ప్రజలకు చాలా నష్టదాయకమని, మన ఇళ్లకు బిగించాలనుకుంటున్న ఈ స్మార్ట్ మీటర్లను వ్యతిరెకిద్దామని ప్రజలకు పైడిరాజు తెలిపారు. ఈప్రచారంలో సిపిఐ మధురవాడ ఏరియా కార్యదర్శి వి సత్యనారాయణ, ఎం ఎస్ పాత్రుడు, డి రాజేష్, ఎన్ ఆదినారాయణ, పి రమణ, కె రాంమహేష్, కె రాములమ్మ, కె రఘు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెదగంట్యాడ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సామాన్య, పేద.మధ్య తరగతి వర్గాలపై అధిక భారం పడే స్మార్ట్ మీటర్ల ను వ్యతిరేకించాలని సీపీఐ పార్టీ కర పత్రాల ద్వారా ప్రచారాన్ని ప్రారంభించింది. బుధవారం సీపీఐ నాయకులు , కార్యకర్తలు కొత్త గాజువాక పెట్రోల్ బంక్, కూరగాయల మార్కెట్, బి.సి.రోడ్ లో ప్రచారాన్ని కొన సాగించింది . ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసి రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపుతో ప్రజలపై అదనపు భారం పడే అవకాశం ఉందని అన్నారు. ప్రజ లంతా స్మార్ట్ మీటర్ల ను వ్యతిరే కించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్య వర్గ సభ్యురాలు కె. వనజాక్షి , నాయకులు జి. ఆనంద్, కె.అచ్యుతరావు, పి. దుర్గారావు, పల్లేటీ పోలయ్య, ఈశ్వర్‌రావు, పిల్లా పద్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన బిజెపి నాయకులు

విశాలాంధ్ర-పెందుర్తి : జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును బిజెపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సుజాతనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్, జిల్లా కార్యదర్శి పులిజాల బాలసుబ్రహ్మణ్యం, పెందుర్తి నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు, పెందుర్తి అర్బన్ మాజీ మండల అధ్యక్షులు రెట్టి జయరాజు, సబ్బవరం నాయకులు గొటివాడ సామ్రాట్ కుమార్ తదితరులతో కలిసి ఎమ్మెల్యేను కలిసిన ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు పెందుర్తి నియోజకవర్గంలో రాజకీయాలు అభివృద్ధి గురించి సుదీర్ఘంగా చర్చించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర- మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 60వ వార్డు గుల్లలపాలెం క్రీడా మైదానంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పలుమార్లు జీవీఎంసీ సిబ్బందికి తెలిపినప్పటికీ పరిష్కారం కాలేదు. ఎట్టకేలకు స్థానిక రిపోర్టర్స్ పదేపదే దీనిపై ప్రస్తావించడంతో బుధవారం జీవీఎంసీ వారు ట్యాంకుకు పైప్ అమర్చి మైదానంలో పాదచారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచ రికార్డులు

గీతంలో ఇస్రో చైర్మన్ నారాయణన్



విశాలాంధ్ర -మధురవాడ : అంతరిక్ష రంగంలో గడిచిన 63 సంవత్సరాలలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) గణనీయమైన ప్రగతిని సాధించిందని ఇతర దేశాలకు సహితం ఉపగ్రహ సాంకేతికతను అందించే స్థాయికి చేరుకుందని ముఖ్యంగా అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించి 9 అంశాలలో ప్రపంచ రికార్డులు నెలకొల్పామని ఇస్రో చైర్మన్ మరియు అతరిక్ష విభాగం కార్యదర్శి డాక్టర్ వి.నారాయణన్ వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో తేది: 16-07-2025న ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇస్రో ఇప్పటి వరకు 101 అంతరిక్ష ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేసిందని అలాగే 35 దేశాలకు సంబంధించి 434 కు పైగా ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించిందని ఆయన తెలిపారు. జి-20 దేశాలకు ప్రత్యేక ఉపగ్రహాన్ని 70శాతం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అంతరిక్ష ప్రయోగాలు ఇస్రోకు ఇప్పుడు మంచినీళ్ళప్రాయంగా మారాయని ఆయన తెలిపారు. భారతీయ వ్యోమగామి శుభాంసు శుక్ల అంతరిక్షంలోకి వెళ్ళి సురక్షితంగా తిరిగి రావడానికి తీసుకున్న జాగ్రత్తలను ఆయన వివరించారు. అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సు కోసం ఎతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఇస్రో పరిజ్ఞానంతో దేశంలో వివిధ రంగాలకు, ప్రజలకు ఉపయోగపడే దాదాపు 50 పైగా సాంకేతిక అంశాలను అందించామని వాటి విలువ కోట్లలలో ఉంటుందని ఆయన తెలిపారు. ఇస్రో సహకారంతో వాతావరణం, ఆహార భద్రత, దేశరక్షణ, మత్స్య సంపద ఉనికి, అడవుల పరిరక్షణ, టెలీ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఇటీవల ఆపరేషన్ సింధూర్‌కు సహితం ఇస్రో సహకారం అందించిందని ఆయన వెల్లడించారు. ఇస్రో మరియు నాసా సంయుక్తంగా పనిచేస్తున్నాయని ఇతర దేశాలు సహితం అంతరిక్ష సాంకేతిక సహకారాన్ని ఆసిస్తున్నాయని ఆయన తెలిపారు. చంద్రయాన్ 3 ప్రాజెక్టును విజయ వంతం చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్నామని తెలిపారు. విద్యా సంస్థలతో కలిసి పనిచేయడానికి ఇస్రో సిద్దంగా ఉందని ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టుల ద్వారా ఆసక్తి గల పరిశోధకులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా మాట్లాడుతూ ఇస్రో సాధిస్తున్న ప్రగతి దేశానికి గర్వకారణం అన్నారు. ఇస్రో సాంకేతిక పరిజ్ఞానం అంతరిక్ష ప్రయోగాలకే కాకుండా వరదల నిర్వహణ, వైకల్యం ఉన్నవారికి జైపూర్ కృత్రిమ అవయవాల తయారీ వంటి ప్రయోజనాలను అందిస్తోందన్నారు. అంతరిక్ష విజ్ఞానం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఇస్రో కొత్త రూపును ఇవ్వగలదన్నారు. కార్యక్రంలో గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ, గీతం ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, వివిధ కళాశాలల డీన్‌లు, ప్రిన్సిపాల్స్, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులఅక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు...

విశాలాంధ్ర-విశాఖ సిటీ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందనీ, ఈ మహా ధర్నాలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావడానికి విజయవాడ ప్రాంతానికి చేరుకోవడం జరిగింది కానీ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల్ని అక్రమంగా నిర్బంధించి అరెస్టులు చేయడం జరిగింది. ఇది చాలా నీచమైన చర్య అని జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు పడాల రమణ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా మున్సిపల్ కార్మికులకు రెగ్యులరైజేషన్ చేస్తామని ప్రభుత్వ పథకాలన్నీ వర్తింప చేస్తామని హామీలు ఇవ్వడం జరిగింది కానీ 14 నెలలుగా కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల కనీస సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవు అందువలన రాష్ట్రంలో ఉన్నటువంటి మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని పోవాలని రాష్ట్ర సమితి నిర్ణయం మేరకు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది విజయవాడ పోలీసులు ధర్నా కార్యక్రమం కు అనుమతి ఇచ్చి కూడా కార్మికులను నాయకులను అరెస్టులు చేయడం నియంత పరిపాలనకు నిదర్శనమని, ఏఐటియుసి కార్మిక సంఘముగా రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు, ఆప్కాస్ స్థానంలో ప్రైవేట్ ఏజెన్సీలకు అధికారాలు ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలి మున్సిపల్, పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలనీ డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, గత ఎన్నికల ముందు 25 వేల లోపు వేతనాలు ఉన్నవారందరికీ సంక్షేమ పథకాల అమలు చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఆప్కాస్ వర్కర్లకి తల్లికి వందనం వర్తింపు చేయాలనీ, వయోపరిమితి 62 ఏళ్ళకు పెంచాలనీ, మున్సిపల్ ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న డి ఏ లు సరెండర్ లీవులు ఎన్ క్యాష్‌మెంట్ గ్రాట్యుటీ వెంటనే చెల్లించాలనీ, నిరుపయోగంగా ఉన్న ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ ను లోపాలను సరిదిద్ది ఉద్యోగులందరికీ మెరుగైన వైద్యశాల కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్లాప్ డ్రైవర్లు సూపర్వైజర్లు లోడర్స్ కు కనీస వేతనాలు. పీఎఫ్ ఈఎస్ఐ. ఉద్యోగ భద్రత కల్పించాలనీ, మున్సిపల్ ఔట్సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కనీస వేతనం 26వేలు అమలు చేయాలనీ, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలనీ, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలుకొనసాగిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక తెలియజేస్తున్నాన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ విజయువాడ
యఫ్.ఏ.నెం. 552 ఆఫ్ 2024

బిట్వీన్
M/s.షిండ్లర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు మరొకరు ...అప్పిలెంట్స్/పిటీషనర్లు/అపోజిట్ పార్టీస్ 2 & 3
అండ్
డాక్టర్ ముదిగొండ రత్నమాల మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు/కంప్లయిమెంట్లు/అపోజిట్ పార్టీస్

నోటీసు

టు
రెస్పాండెంటు నెం.5:
M/s. **ఫ్లష్ ఎలివేటర్**, కృష్ణా కాలేజ్ రోడ్డు, భాను నగర్, హెచ్.బి. కాలనీ,విశాఖపట్నం-530022
(రాష్ట్ర కమీషన్ ఇచ్చిన IA/658/2025 ఉత్తర్వు ప్రకారం ఈ నోటీసు మీకు జారీచేయబడినది)

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పై తెలిపిన అప్పిలెంట్స్ అయిన M/s.షిండ్లర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు మరొకరు, మహారాజశ్రీ డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్ కమీషన్-II, విశాఖపట్నంలో CC/139/2022 ఇచ్చిన ఉత్తర్వులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయువాడలో పైనెంబరు పిటీషన్‌లోని F.A. 552/2024 పై అప్పిలెంట్స్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీయొక్క హాజరు కొరకు **తేది. 05-08-2025**కి వాయిదా అయివున్నది. కావున పై తెలిపిన **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, అశోక్‌నగర్, విజయ వాడ** నందు **తేది. 05-08-2025 ఉ॥గం॥10.30 ని॥**లకు మీరు స్వయంగా గానీ లేదా మీ తరుపున న్యాయవాది గారి ద్వారాగాని హాజరై మీయొక్క అభ్యంతరములు, ఆక్షేపణలు తెలియపర్చవలెను. లేని యెడల పైపిటీషన్ మీ పరోక్షమందు తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

D. RAVI KIRAN, Advocate
Flat No.TF-2, Surya Apartments, Mogalaraj Puram, Vijayawada. **Cell: 94401 57690**

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటైన విశాఖపట్నం బస్తీ, కనక మహాలక్ష్మి గుడి దగ్గర, దావల వారి వీధి, కనక సాయి రెసిడెన్సీ యొక్క (500Sft.) గ్రౌండ్ ఫ్లోర్, యూనిట్/ఫ్లాట్ నెం.101రు కాు॥లు గురజాడ అప్పారావు గారి భార్య గురజాడ జ్యోతి, D/o. ముసినాడ రాంబాబు వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం,

ఈ క్రింది షెడ్యూలు ఆస్తి విశాఖపట్నం SRO లో రిజిష్ట్రీ కాబడిన గిఫ్ట్ దస్తావేజు నెం.4355/2012 రు మూలంగా ఆమె తండ్రి గారైన శ్రీ ముసినాడ రాంబాబు గారి వలన దఖలు పడినది. సదరు రాంబాబు గారు ఈ ఆస్తిని క్రయదస్తావేజు నెం.1908/2005రు కొనుగోలు చేసియున్నారు. ఈ దస్తావేజు నా క్లయింటు ఆస్తికి లింకు దస్తావేజు అయివున్నది. పైన తెలుపబడిన లింకు దస్తావేజు నెం.1908/2005 యొక్క ఒరిజినల్‌ను తేది. 12-07-2025 న ఆమె ఇంటివద్దనుండి కురుపాం మార్కెట్ మెయిన్ రోడ్ లో జెరాక్స్ కాపీలు తీయించుటకు వెళ్తుండగా మార్గమధ్యలో పోయినది. నా క్లయింటు వెంటనే స్పందించి ఎంతవెతికినా దొరకలేదని తెలియజేయుడమైనది.

కావున షెడ్యూలు ఆస్తికి సంబంధిత ఒరిజినల్ లింకు దస్తావేజు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ ప్రకటన వెలువడిన తేది.లగాయతు **7రోజులలోగా**, ఈక్రింది అడ్రస్‌కు తెలియపరచవలెను. అట్లు కాకుండా ఇతరులెవరైనా పైన తెలిపిన ఆస్తిపై దురుద్దేశ్యపూర్వకంగా ఎట్టి తనఖాలు, క్రయ ఒప్పందాలు, లీజులు, విక్రయములు వగైరా ఎట్టి అన్యాక్రాంతములు చేయదలచిన యెడల అట్టివారిపై నా క్లయింటు తీసుకొనబోవు చట్టపరమైన సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు. అట్టివి నా క్లయింటు హక్కులను బంధింపజాలవు.

షెడ్యూలు ఆస్తి: విశాఖపట్నం బస్తీ, విశాఖపట్నం SROలో చేరిన జి.వి.యం.సి. పరిధి, **సీతారామ స్వామి టెంపుల్ వార్డు**, టౌన్ సర్వే నెం. 629రు, దావలవారి వీధి, డోర్ నెం.22-71-16, ఇంటి పన్ను అసెస్‌మెంట్ నెం.100000/20070, మొత్తము 166.66చ॥గ॥లు విస్తీర్ణం స్థలములో భాగమైన అనిర్దిష్టమైన, అవిభాజ్యతపు వాటా **17 చ॥గ॥లు** లేక **14.214 చ॥మీ॥లు** స్థలము అందలి ఫ్లాటు నెం. 101రు, "కనక సాయి రెసిడెన్సీ" గ్రౌండ్ ఫ్లోర్ 500 చ॥అ॥లు ఆస్తికి హద్దులు: **తూర్పు:** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం:** యం.శివరామయ్య గారి ఇల్లు, **పడమర:** రోమన్ కాథలిక్ చర్చ్ బౌండరీ గోడ, **ఉత్తరం:** పి. వెంకట రమణమూర్తి & సీతారామ మూర్తి గారిఇల్లు. **ఫ్లాట్ హద్దులు: తూర్పు:**మున్సిపల్ రోడ్డు, **దక్షిణం:** యం. శివరామయ్య గారి ఇల్లు, **పడమర:** స్టెయిర్ కేస్ కొంతవరకు & యూనిట్ నెం. 102 కొంతవరకు, **ఉత్తరం:** పి. వెంకట రమణ మూర్తి & సీతారామమూర్తి గారిఇల్లు.

A. ANURADHA, Advocate
40-20-12, Flat No. 101, Krishnam Enclave, Dondaparthi, Visakhapatnam. **Cell:9394333372**

వైభవంగా నిత్య కళ్యాణం

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరము స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

మండల నామినేటెడ్ పదవుల్లో కాపులకు మాత్రమే ప్రాధాన్యత..!

విశాలాంధ్ర-పద్మనాభం : భీమిలి నియోజకవర్గంలో పద్మనాభం మండలానికి దక్కనున్న నామినేటెడ్ పదవులలో కాపులకే అధిక ప్రాధాన్యతను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇస్తున్నట్లు మండలంలో ఆ నోట, ఈ నోట చర్చించుకుంటున్నారు.పద్మనాభం మండలానికి సంబంధించి నామినేటెడ్ పదవులలో జనసేన పార్టీకి స్వల్ప గుర్తింపు దక్కగా,భారతీయ జనతా పార్టీ జాడ కనుమరుగైందని పలువురు బిజెపి ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఐదు పీఏసీఎస్‌లకు సంబంధించి ఒక చైర్మన్, మూడు కమిటీ సభ్యులు ఇవ్వాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకి బిజెపి జిల్లా కార్యాలయం నుంచి నివేదిక ద్వారా గతంలోనే కోరినప్పటికీ గ్రూపుల గోలతో కొంతమంది తెలుగుదేశం నాయకులు బిజెపికి నామినేటెడ్ పదవులు దక్కకుండా ఎమ్మెల్యేను మభ్యపెట్టినట్టు తెలియ వచ్చింది. 1983 లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావించినప్పటి నుంచి నాలుగు సార్లు భీమిలి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పదవి పొందిన మాజీ ఎమ్మెల్యే ఆర్ ఎస్‌డిపి అప్పల నరసింహరాజు హయాంలో పద్మనాభం మండలంలో నాడు రాజుల హవా హల్ చల్ చేయగా,రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పదవి పొందిన ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హయాంలో కాపుల హవా హల్ చల్ చేస్తుందని పలువురు చెబుతున్నారు. అయితే ఈనెల 14 న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పిఏసిఎస్) త్రీ మెన్ కమిటీ లకు సంబంధించి పద్మనాభం మండలంలో ఐదు పిఎసిఎస్‌లు ఉండగా మూడు చైర్మన్ పదవులు కాపులకు,ఒక చైర్మన్ నాగవంశం కులానికి,ఒక చైర్మన్ రాజులకు ప్రకటించనున్నట్లు తెలిసింది.రెడ్డిపల్లి పిఏఎస్ఎస్ చైర్మన్‌గా తెలగ కాపు కులానికి చెందిన కర్నెడ్డి శ్రీరాములు (92 సంవత్సరాలు), పాండ్రంగి పిఎసిఎస్ చైర్మన్‌గా కాపు కులానికి చెందిన బర్నాల సత్య శ్రీనివాసరావు, గంధవరం పిఎసిఎస్ చైర్మన్‌గా కాపు కులానికి చెందిన జుత్తాడ గణేష్, పద్మనాభం పిఎసిఎస్ చైర్మన్‌గా నాగవంశం కులానికి చెందిన మొకర అప్పలనాయుడు(అన్నమయ్య), బాందేవపురం పిఎసి.ఎస్ చైర్మన్‌గా క్షత్రియ కులానికి చెందిన సాగి కృష్ణమూర్తి రాజుల నామినేటెడ్ పదవుల ఎంపికపై పద్మనాభం మండలంలో రెండు గ్రూపులుగా ఉన్న టిడిపి నాయకులు ఎమ్మెల్యే గంటా వద్ద పైరవీలు నడిపినట్లు తెలిసింది. అలాగే ఒక్కొక్క పిఎసిఎస్ పరిధిలో ఇద్దరు చొప్పున ఐదు పిఎసిఎస్‌లలో పదిమంది సభ్యులు ఉండగా ఐదు కాపు కులానికి, రెండు నాగవంశం కులానికి, రెండు వెలమ కులానికి, ఒకటి యాదవ ఒకలానికి ఎంపిక చేసినట్టు చెబుతున్నారు.ఇదిలా ఉండగా వెలమల ఇలాక గ్రామాల్లో ఉన్న గంధవరం పిఎసిఎస్ చైర్మన్ పదవి కాపులకు కట్టబెట్టి,వెలమలకు కమిటీ సభ్యులతో సరిపెట్టి వెలమల ఉనికిని దెబ్బతీయడంపై అనంతవరం, పెంట, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ గ్రామాల వెలమ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వెలమల ఇలాకలో లోకవరపు అబ్బాయి నాయుడు జడ్పిటిసిగా, సబ్బవరపు వెంకటరావు రెండుసార్లు గంధవరం పిఎసిఎస్ చైర్మన్‌గా, మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా కరిమిరెడ్డి అప్పలనాయుడు, గొర్రపాటి వెంకటలక్ష్మి లకు ఇచ్చి తెలుగుదేశం పార్టీ గౌరవించిందని వెలమ నాయకులు చెబుతున్నారు. వెలమలు ఎప్పుడు అధికంగా తెలుగుదేశం పార్టీ వైపే ఉన్నారని, ఇప్పుడు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గంటా తోనే వెలమలు ఉన్నారని, వారి హయాంలో వెలమలకు ఎప్పుడూ ముఖ్య పదవులు దక్కలేదని, కనీసం గంధవరం పిఎసిఎస్ చైర్మన్ పదవినైన వెలమలకు కేటాయించాలని వెలమ ఇలాక నాయకులు కోరుతున్నారు. అంతేకాకుండా పద్మనాభం మండలంలో దళితులకు పిఎసిఎస్ చైర్మన్, కమిటీ సభ్యుల నామినేటెడ్ పదవులలో ఒక్కరికైనా స్థానం కల్పించకపోవడంపై పలువురు దళితులు ఆవేదన చెందారు.గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పద్మనాభం మండల పరిషత్ అధ్యక్షులుగా దళిత కులం నుంచి పెంట గ్రామానికి చెందిన అలమండ ఉమామహేశ్వరరావు, బాందేవపురం గ్రామానికి చెందిన వగల ముత్యాలు పదవులు నిర్వహించగా ప్రస్తుతం దళితులకు కనీసం పిఎసిఎస్ సభ్యులుగా కూడా స్థానం కల్పించకపోవడంపై పెదవి విరిస్తున్నారు. అయ్యా ఎమ్మెల్యే గంటా గారు పద్మనాభం మండలంలో గ్రూపు నాయకుల గోల మరిచి, పెద్ద మనసు చేసుకొని కూటమి ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం చేయాలని మండల బిజెపి నాయకులు,వెలమల ఇలాక నాయకులు,తెలుగుదేశం పార్టీ దళితులు కోరుతున్నారు.

పినగాడి పంచాయితీలో కూటమి అభ్యర్థి గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ధీమా
- ఏడాదిలోగా హామీలన్నీ నెరవేరుస్తానని వెల్లడి

విశాలాంధ్ర-పెందుర్తి : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పెందుర్తి మండలం పినగాడి గ్రామపంచాయతీని ఎన్డీఏ కూటమి కైవసం చేసుకుంటుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు. గతంలో స్వల్ప తేడాతో ఓటమి పాలైనప్పటికీ, ఆ తర్వాత నిరంతరం ప్రజలతో కలిసి ఉండి, వారి కష్టసుఖాలలో భాగస్వాములుగా ఉన్నామని పేర్కొన్నారు. బుధవారం ఉదయం పినగాడి పంచాయితీ పరిధిలో సుమారు కోటి 50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పినగాడి, కోట్నివాని పాలెం గ్రామాలలో పాదయాత్ర చేసి ప్రజలను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల మహిళలు హారతులిచ్చి యువకులు బాణాసంచా కాల్చి, పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పినగాడిలో టిడిపి సీనియర్ నాయకుడు బయలపూడి హరగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పినగాడి ప్రజలు చూపిన ఆధారాభిమానాలు ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. గత ఐదేళ్లలో గ్రామంలో అభివృద్ధి కుంటుపడిందని ఏడాదిలోగా ప్రజల సమస్యలన్నీ పరిష్కరించి మీ ముందుకు గౌరవంగా వస్తానని పేర్కొన్నారు. బైలపూడి హరగోపాల్ లాంటి నాయకులు ప్రతి గ్రామానికి కావాలని, ప్రజల కోసం గ్రామాభివృద్ధి కోసం ఆయన నిరంతరం ఆరాటపడతారని ప్రశంసించారు. ప్రతి గ్రామంలోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో చైతన్యం తేవాలని కూటమి నాయకులకు వేదికపై నుండి సూచించారు. గత ఏడాది కాలంలో దాదాపు 229 కోట్ల నిధులతో పెందుర్తి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే రమేష్ బాబు స్పష్టం చేశారు. దీనికి సంబంధించి జనసేన నాయకులు రూపొందించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సీనియారిటీతో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో, ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రాము నాయుడు, ఎంపీపీ నాగమణి, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కరకదేముడు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కొరుప్రోలు రామునాయుడు, ఇందల రమణ పిన్నింటి పార్వతి, అయితి సింహాచలం, గల్లా శ్రీనివాసరావు, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, జగన్ మోహన్ పాత్రుడు, బైలపూడి ఉమామహేశ్వరరావు, వరూధిని, మడక పార్వతి అప్పలరాజు రాపర్తి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి ఎప్పుడూ ఇబ్బందులే

- నిత్యం పని వేళలు... కుటుంబంతో సమయాన్ని వెచ్చించలేక ఇబ్బందులు..
- నిత్యం సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రక్షకబటులు
- నాలుగు పర్యాయాల బకాయిలు పెండింగ్.
- వారాంతరపు సెలవు లేకపోవడం, తీవ్రమైన పని ఒత్తిడి ,అధిక పని గంటలు

విశాలాంధ్ర-అనందపురం : ప్రజలకు ఇబ్బందులు ఉన్నప్పుడు టక్కున గుర్తొచ్చే వాళ్ల పోలీసులు ప్రమాద సమయంలో ఏ సమస్యలతోనైనా సతమత మవుతున్నప్పుడు అందుబాటులో ఉండేవారు రక్షక భటులే, అటువంటి ఖాకీలకు ఉన్నాయి కదా సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని వాపో తున్నారు. పోలీస్ స్టేషన్ కానీ అదే పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అనేక సమస్యలతో శతమతమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. వారు సొంత బాధలు చెప్పుకునేందుకు ఎవ్వరూ లేక, విధులు నిర్వహించడమే కాకుండా కుటుంబ బాధ్యతల్ని మోయడం చాలా కష్టంగా మారింది. మూడేళ్ళుగా సరెండు లీవ్‌లు, టీఏలు (ట్రావెల్ అలవెన్సులు), వారాంతపు సెలవులు మంజూరు కాకపోవడంతో, ఒక్కో పోలీస్ సిబ్బందికి సంవత్సరానికి 1లక్ష రూపాయల పైగా లభించాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. 2021 సంవత్సరంలో ఆగినప్పటికీ మరల 2022లో కొంతమేర ఇచ్చారు. 2023 నుంచి ఇప్పటివరకు రావడంలేదని నిరాశ చెందుతున్నారు. దీని ప్రభావం కుటుంబాలపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా పిల్లల చదువు విషయంలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు విధుల్లో రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉంటే, అటు తాము రక్షణ పొందలేక అల్లాడుతున్నారు. సమస్యలు వచ్చినప్పుడు ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తారు. అయితే పోలీసులకు సమస్యలు వచ్చినప్పుడు ఫిర్యాదు చేయడానికి ఎవరు ఉన్నారు అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కింది స్థాయి సిబ్బంది విపరీతమైన ఆర్థిక ఒత్తిడితో తీవ్ర నిరాశలో ఉన్నారు. కొందరు అధికారుల నిర్లక్ష్య కారణంగా, బకాయిలు చెల్లించకపోవడంతో వారి జీవితం మరింత ఇబ్బంది కరంగా మారింది. ఈ నేపథ్యంలో కొందరు అధికారి సకాలంలో స్పందించక పోతే, కొన్ని అపరాధ దారులు తలుపుతట్టే ప్రమాదం ఉందని అశంకిస్తున్నారు. ఈ పరిస్థితులన్నింటిని పరిగణలోకి తీసుకుని, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని, రక్షక బటులను గౌరవించే విధంగా వారికి రావలసిన ప్రయోజనాలు మంజూరు చేయాలని, 8నుండి 12 అదనంగా విధులు నిర్వర్తించాల్సి వస్తుందని కుటుంబం పిల్లలతో సమయం కేటాయించలేక సతమతమవుతూ ఇబ్బందులు పడుతున్నారు.అవసరమైన సంక్షేమ నిధులు విడుదలచేసి రక్షకబటులను ఆదుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన బిజెపి నాయకులు

విశాలాంధ్ర-పెందుర్తి : జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును బిజెపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సుజాతనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్, జిల్లా కార్యదర్శి పులిజాల బాలసుబ్రహ్మణ్యం, పెందుర్తి నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు, పెందుర్తి అర్బన్ మాజీ మండల అధ్యక్షులు రెట్టి జయరాజు, సబ్బవరం నాయకులు గొటివాడ సామ్రాట్ కుమార్ తదితరులతో కలిసి ఎమ్మెల్యేను కలిసిన ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు పెందుర్తి నియోజకవర్గంలో రాజకీయాలు అభివృద్ధి గురించి సుదీర్ఘంగా చర్చించారు.

తాగునీటి సమస్య పరిష్కారం



విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 60వ వార్డు గుల్లలపాలెం క్రీడా మైదానంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పలువమార్లు జీవీఎంసీ సిబ్బందికి తెలిపినప్పటికీ పరిష్కారం కాలేదు. ఎట్టకేలకు స్థానిక రిపోర్టర్స్ పదేపదే దీనిపై ప్రస్తావించడంతో బుధవారం జీవీఎంసీ వారు ట్యాంకుకు పైప్ అమర్చి మైదానంలో పాదచారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

అంబరాన్నంటిన సిపిఇ కళాశాల సంబరాలు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : నగరంలోని ప్రముఖ కామర్స్ కళాశాల సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్ (సిపిఈ) జూనియర్ కాలేజీ 19వ వార్షికోత్సవేడుకలను బుధవారం నగరంలోని మద్దిలపాలెం గల కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో హెరారెత్తించారు. పాటలు, డాన్సులు, స్కిట్స్ ప్రదర్శిస్తూ హాజరైన 850 మంది విద్యార్థినీ,విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా గడిపారు.లెడ్ మ్యూజిక్ బ్యాండ్, విద్యార్థులలో సెల్ ఫోన్ వ్యసనం పై స్కిట్ ఎంతగానో ఆకట్టు కుంది. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కళాశాల కో.ఫౌండర్ అండ్ డైరెక్టర్, చార్టెడ్ అకౌంటెంట్ మంగిపూడి రామచంద్రం, సీఈవో బి.ఆదినారాయణ, అతిధులుగా జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బి.శ్యామల, సిఏ అండ్ సిఎంఏ అకాడమీ ప్రిన్సిపల్ పి.ఎస్.వి. ప్రసాద్ హాజరయ్యారు. వారి చేతులమీదుగా సిఏ, సిఎంఏలలో అఖిల భారత స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు నగదు బహుమతులు ప్రధానం చేసారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 96శాతానికిపైగా మార్కులు సాధించి టాపర్స్ నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు, ఐపీఈ రెండవ సంవత్సరంలో 1000కి 960 మార్కులు, బెటర్ మెంట్ తర్వాత 500కు 480 మార్కుల సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సిపిఇ విద్యార్థులు రెండు ప్రతిభ అవార్డులను కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. విశాఖ నగరంలో కామర్స్ విద్యలో ఎంఇసి, సిఇసి గ్రూపులలో తమ కళాశాల నందు ఉత్తమ విద్య నందిస్తున్నామని, ప్రత్యేకంగా సిఎ, సిఎంఏ కోర్సులకు ప్రత్యేక శిక్షణనిస్తూ గత 18ఏళ్లుగా అనేక విజయాలు సాధించామని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల నుండి ఐపిమ్యాట్,క్లాట్ కోర్సులలో శిక్షణనిస్తున్నామని తెలిపారు.

రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుక

విశాలాంధ్ర-అనందపురం : స్థానిక ఆనందపురం రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మిస్టర్ రేగి పి.డి, డిప్యూటీ కమాండెంట్, ఐ.టీ.బీ.పీ విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందించారు. నాయకత్వ ప్రాముఖ్యతను, నాయకత్వ లక్షణాలను మరియు విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ యం.యెస్.మణి విద్యార్థి నాయకులకు చిత్తశుద్ధి, అంకితభావం మరియు శ్రేష్టత, నిబద్ధత వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలని తెలియజేస్తూ, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నార్త్ ఆంధ్ర జోనల్ ఇంఛార్జ్ ఎన్.వెంకటేష్ కార్యక్రమంలో పాల్గొని నూతనంగా నాయకులుగా ఎన్నికైన విద్యార్థులు ప్రతిభావంతమైన నిర్ణయాలతో తోటి విద్యార్థులలో క్రమశిక్షణను, నైతిక విలువలను, బాధ్యతను పెంపొందింపజేయాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ఉమామహేష్, ప్రిన్సిపాల్ బోయ జ్యోతి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ద వహించాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్



విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : అభ్యంతరం కాని అనధికారిక ఆక్రమణలు, నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో నెం.30 తాలూక ఉద్దేశాలను, ఆవశ్యకతలను ప్రజలకు తెలియపరచాలని, పూర్తి సహకారం అందించాలని సూచించారు. జీవో ప్రకారం 15.10.2019 తేదీకి ముందు జరిగిన ఆక్రమణలను పరిగణనలోకి తీసుకొని ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. సచివాలయాల వారీగా జాబితాలను ప్రచురించాలని సూచించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ మీటింగు హాలులో వేర్వేరుగా జరిగిన విశాఖపట్టణం, భీమిలి రెవెన్యూ డివిజన్ల కాన్ఫరెన్స్ లలో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులు, పీజీఆర్ఎస్ వేదికగా వచ్చిన వినతుల పరిష్కారంలో చొరవ చూపాలని, వివిధ సమస్యల పరిష్కారం కోసం తమ వద్దకు వచ్చే సామాన్యుల పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించాలని, సత్వర సేవలందిస్తూ అండగా నిలవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న సేవలపై సానుకూల వైఖరి వచ్చేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని, స్నేహపూర్వక వాతావరణంలో సేవలందించాలన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజతో మర్యాదగా ఉండాలని, వారి సంతృప్తే కొలమానంగా రెవెన్యూ సిబ్బంది పనితీరును అంచనా వేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రీ సర్వే, మ్యుటేషన్ల ప్రక్రియలో పారదర్శకత లోపించకుండా పని చేయాలని చెప్పారు. భూముల క్రమబద్ధీకరణ విషయంలో చురుగ్గా వ్యవహరించాలని, ఆక్రమణల తాలూక వివరాలను ప్రతి సచివాలయం పరిధిలో ప్రదర్శించాలని ఆదేశించారు. కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలని, కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పారు. ప్రభుత్వ నిర్దేశాలకు అనుగుణంగా ప్రతి అధికారీ పని చేయాలని, ప్రజా సేవలో మరింత నాణ్యత కనిపించేలా వ్యవహరించాలని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాధుర్, సర్వే శాఖ ఏడీ సూర్యారావు, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో ఫ్లిప్‌కార్ట్ 'ఫుడ్ ఫెస్ట్ 2.0'

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలో స్వదేశీ ఈ కామర్స్ మార్కెట్ ప్లేస్ ఫ్లిప్‌కార్ట్ బెంగళూరులో జూలై 8, 9వ తేదీలలో 'ఫుడ్ ఫెస్ట్ 2.0' నిర్వహించింది. ఇది రెండో ఎడిషన్. జూలై 5 నుంచి జూలై 10వ తేదీ వరకు క్యూరేటెడ్ సేల్ ద్వారా ఈ ఫెస్ట్ ఆన్‌లైన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ కన్స్యూమబుల్స్ (బ్యూటీ, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్) సీనియర్ డైరెక్టర్ నిశాంత్ దలాల్ మాట్లాడుతూ ఈ ఫుడ్ ఫెస్ట్ ద్వారా గౌర్మెట్ ఫుడ్ డిస్కవరీ, స్టోరీ టెల్లింగ్, కమ్యూనిటీ నేతృత్వంలోని వాణిజ్యం కొత్త యుగాన్ని నిర్మిస్తున్నామన్నారు. ప్రతి భారతీయుడికి ఇష్టమైన గమ్యస్థానంగా ఫ్లిప్‌కార్ట్‌ను మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ ఉత్సవం క్రియేటర్లు, చెఫ్‌లు, సెలబ్రిటీలు, బ్రాండ్‌లు, కస్టమర్ల రుచి, సాంకేతికత భాగస్వామ్య వేడుకలో ఒకచోట చేర్చిందన్నారు. సాంకేతికత, వినోదం, జీవనశైలిని మిళితం చేయడం ద్వారా ఈ-కామర్స్‌ను తిరిగి ఊహించుకుంటూనే ఉన్నందున, మా భాగస్వాముల కోసం కస్టమర్ అనుసంధానిత , కేటగిరీ ఆవిష్కరణ స్థిరమైన వృద్ధిని పెంపొందించే ప్లాట్‌ఫారమ్‌లను నిర్మించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ సందర్భంగా హప్పిలో వ్యవస్థాపకుడు, సీఈఓ వికాస్ నహర్ మాట్లాడుతూ ఫుడ్ ఫెస్ట్ 2025 కోసం ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం ఆనందంగా ఉందన్నారు.

శామ్‌సంగ్ ఇండియా ఎం.శ్రేణి స్మార్ట్ మానిటర్లపై ప్రారంభ ఆఫర్లు

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సాంసంగ్, తన నూతన స్మార్ట్ మానిటర్‌ల శ్రేణిని విడుదల చేసింది. ఈ ఆఫర్ జూలై 7 నుంచి 20 వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో భాగంగా రూ. 3,000 వరకు తక్షణ పొదుపును పొందవచ్చు. ఈ సిరీస్‌లో ఫ్లాగ్‌షిప్ 4 కే క్యూడీ ఓఎల్ఈడి మానిటర్ ఎం 9, తాజా మోడల్ ఎం8, మరియు స్మార్ట్ పనితీరుతో మెరుగుపరచిన ఎం7 వేరియంట్లు ఉన్నాయి. వీటన్నింటిలోనూ ఆధునిక ఏఐ సామర్థ్యాలు ఉండటంతో, వినియోగదారులు ఒకే పరికరంలో వీక్షణ, వర్క్ మరియు గేమింగ్ అనుభవాలను సులభంగా ఆస్వాదించవచ్చు.

స్మార్ట్ మానిటర్ ఎం-9 : స్మార్ట్ మానిటర్ ఎం 9 అత్యాధునిక 32అంగుళాల 4 కే క్యూడీ ఓఎల్ఈడి డిస్ప్లేతో, ప్రతి టాస్క్‌లోనూ గొప్ప రంగులు, లోతైన కాంట్రాస్ట్‌ను అందిస్తుంది. ఇది పని, గేమింగ్ మరియు స్ట్రీమింగ్‌కి అనుకూలంగా రూపొందించబడింది. బర్న్‌ఇన్ ప్రొటెక్షన్, యాంటీ గ్లేర్ టెక్నాలజీ వంటి ఫీచర్లతో ఇది దీర్ఘకాలిక మన్నికను అందిస్తూ వినియోగదారుని సౌకర్యాన్ని మెరుగుపరుస్తుంది. సాంసంగ్ అందించే ఇది ఒక స్మార్ట్ ఎంటర్టైన్మెంట్ హబ్‌లా పనిచేస్తుంది.

ఎస్ఐజిహెచ్‌ని సమర్పిస్తున్న రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్

విశాలాంధ్ర-విశాఖపట్నం : యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్ తో కలిసి బ్రాండ్ యొక్క ఫ్లాగ్ షిప్ మ్యూజిక్ ఐపి అయిన రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్, రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ఒరిజినల్స్ కింద కొత్త శ్రేణితో మళ్లీ వస్తోంది-ఇది మెలోడీ మరియు హిప్ - హాప్ ను కలిపే ఒక ప్రత్యేకమైన రూపం. పెహలే జైసీ బాత్ నహీ, హుడీ, మొహబ్బత్, మరియు ఇంతిహాన్ వంటి ట్రాక్స్ విజయవంతమైన తరువాత, ప్లాట్ ఫాం ఇప్పుడు ఈ సీజన్‌లో తమ మొదటి ఒరిజినల్ ఎస్ ఐ జిహెచ్ ను విడుదల చేసింది- నిఖిత గాంధీ మరియు డైనో జేమ్స్ నటించిన శక్తివంతమైన సహకారం. గత మూడు సంవత్సరాలుగా వివిధ యువ కేంద్రాల్లో అత్యంత ఉత్సాహవంతమైన ఆన్-గ్రౌండ్ అనుభవాలతో ప్రేక్షకులను ఆకర్షించిన తరువాత, రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ దాని రెండవ సీజన్ బూమ్ బాక్స్ ఒరిజినల్స్ తో తిరిగి వచ్చింది. బ్రాండ్ యొక్క లివింగ్ ఇట్ లార్జ్ స్ఫూర్తి ని సంబరం చేసుకునే సౌండ్ ట్రాక్స్. భారతదేశపు సంగీత పరిస్థితిని పునర్నిర్వచించడాన్ని కొనసాగించడానికి - శైలుల్ని, వాయిస్‌లు మరియు సంస్కృతులను మిశ్రమం చేస్తోంది మరియు జనరేషన్ లార్జ్ యొక్క ఒరిజినల్ సౌండ్‌ను సృష్టిస్తోంది. ట్రాక్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ఒరిజినల్స్ శ్రేణికి సాహసోపేతమైన వాతావరణాన్ని తెచ్చింది - దీనిలో ప్రశాంతమైన మెలోడీ ఉత్సాహవంతమైన హిప్-హాప్ ను కలుస్తుంది. మీరు మీ ఎంపికలను సమర్థించడం మరియు మీ సొంత మార్గాన్ని ఏర్పరచుకోవాలని మీరు కోరుకోవడం ఆపు చేయాలని ఎంచుకున్నప్పుడు ఆ నిర్వచించబడే క్షణాలను ఇది సంపూర్ణంగా గ్రహిస్తుంది. సాఫీ గళాలు మరియు అసౌకర్యం లేని ధోరణితో, ఎస్ ఐ జిహెచ్ అంటే మీరు ఎవరో మీరే స్వయంగా తెలుసుకోవడం మరియు ఆత్మవిశ్వాసం మరియు స్టైల్ తో కనిపించడం గురించి వివరిస్తుంది.

పాఠశాల వయస్సులో అందించే బూస్టర్ డోస్ కీలకం

-ప్రముఖ నియోనాలజిస్ట్, పిల్లల వైద్యులు డాక్టర్ కె.శేషగిరి

విశాలాంధ్ర-విశాఖపట్నం : టీకా ద్వారా నివారించగల వ్యాధుల నుండి పిల్లలను రక్షించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాల నడుమ, పాఠశాల ప్రవేశ వయస్సులో పిల్లలకు డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు మరియు పోలియోకు వ్యతిరేకంగా బూస్టర్ డోస్‌ను సకాలంలో అందించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. బాల్యంలో అందించే టీకాలు ముందస్తు రక్షణకు పునాది వేసినప్పటికీ, ఆ రోగనిరోధక శక్తి కాలక్రమేణా బలహీనపడుతుంది. అందుకే పిల్లలకు నాలుగు, ఆరు సంవత్సరాల మధ్య ఆ రక్షణను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇండియన్ నేషనల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ 6, 10 మరియు 14 వారాలలో డీటీపీ టీకాలు, 16 నుండి 24 నెలలకు బూస్టర్‌తో కూడిన టీకాలు వేయాలని వివరిస్తుంది. పోలియో టీకాలు కూడా 6, 14 వారాలలో పాక్షిక మోతాదులలో ఇవ్వబడతాయి. అయితే, నాలుగు సంవత్సరాల వయస్సులో యాంటీబాడీ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి, ముఖ్యంగా పిల్లలు పాఠశాల పరిసరాలలో ఎక్కువ మంది పిల్లలను కలవటం ప్రారంభించినప్పుడు ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. రోగనిరోధకతకు సంబంధించి ఒక ఆచరణాత్మకమైన మరియు ముఖ్యమైన తనిఖీ కేంద్రం, పాఠశాల ప్రవేశం " అని విశాఖపట్నంలోని లోటస్ హాస్పిటల్స్‌లోని చీఫ్ కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ & పీడియాట్రిషియన్ డాక్టర్ కె శేషగిరి అన్నారు.డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు మరియు పోలియో వంటి వ్యాధులకు పిల్లల రోగనిరోధక శక్తి క్రమంగా తగ్గుతుంది. ఆ రక్షణను పునరుద్ధరించడానికి 4 నుండి 6 సంవత్సరాల మధ్య బూస్టర్‌ను అందించడం చాలా అవసరం. ఇది తీవ్రమైన అనారోగ్యం బారిన పడకుండా కాపాడటమే కాకుండా, భారతదేశం యొక్క పోలియో రహిత స్థితితో సహా కష్టపడి సాధించిన ప్రజారోగ్య లాభాలను నిలబెట్టుకోవడానికి కూడా సహాయపడుతుంది" అని అన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- అత్యవసర పరిస్థితుల్లో ఎలా కాపాడుకోవాలి
- ప్రమాదాలపై అవగాహన కల్పించిన ఫైర్ సిబ్బంది

విశాలాంధ్ర -ఆనందపురం : అగ్ని ప్రమాదాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఫైర్ అధికారి శ్రీనివాస రాజు తెలిపారు. బుధవారం ఆనందపురం మండలం లోడగల పంచాయతీ పరిధిలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలు సంభవించినప్పుడు తగిన స్పందన చాలా కీలకమైందన్నారు. పెట్రోల్ బంకుల్లో ఏర్పాటు చేసిన సేఫ్టీ గ్యాస్ సిస్టమ్ ద్వారా మంటలను అదుపు చేయవచ్చని తెలిపారు. ప్రతి బంకులోనూ తప్పకుండా సేఫ్టీ పరికరాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు వంటి వాటిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే, బంకు సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై పలు సూచనలు, సలహాలు అందించిన ఫైర్ అధికారిని బంకు నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బంకు నిర్వాహకులు పూడి రమేష్, లీడింగ్ ఫైర్ మెన్ చక్రవర్తి ఫైర్ మెన్ రమేష్ బాబు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పద్మనాభంలో సీజీఆర్ఎఫ్ సమావేశం

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర -పద్మనాభం : ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సును విశాఖపట్నం జోన్-3 డివిజన్, పద్మనాభం సెక్షన్లో గురువారం నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్ పర్సన్, విశ్రాంతి జడ్జి బి సత్యనారాయణ పేర్కొన్నారు. పద్మనాభం సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే మీటింగ్ లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను చైర్ పర్సన్, సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించవచ్చని సూచించారు. ఈ సదస్సులో చైర్ పర్సన్ బి.సత్యనారాయణతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్ రాజబాబు, ఎస్ సుబ్బారావు, ఎన్ మురళీకృష్ణ పాల్గొంటారు.

వెంకటాద్రి హుండీ ఆదాయం రూ.6.25 లక్షలు

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి వెంకటాద్రిపై గల శ్రీనివాసుని ఆలయంలో స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం పర్యవేక్షణ అధికారి పిఎల్ఎన్ రాజు, ఈవో నీలిమ పర్యవేక్షణలో బుధవారం జరిగింది. 90 రోజులకు హుండీ ఆదాయం ఆరు లక్షల 25వేల 541 రూపాయలు వచ్చిందని అధికారులు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు మోర్త శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై పెద్ద సంఖ్యలో సూచనలు

వీఎంఆర్డీఏలో ప్రత్యేక కార్యక్రమం

విశాలాంధ్ర-విశాఖ : వీఎంఆర్డీఏ రూపొందించిన బృహత్ ప్రణాళిక -2041 పై సలహాలు, సూచనల స్వీకరణకి అనూహ్య స్పందన లభించింది. వీఎంఆర్డీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాధన్ వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, వంశీ కృష్ణ శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతి రాజు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, జీవీఎంసీ కార్పొరేటర్లు ఎస్.పద్మా రెడ్డి, స్టాలిన్ తదితరులు పాల్గొని తమ పరిధిలోని, తమ దృష్టికి వచ్చిన మాస్టర్ ప్లాన్ కు సంబంధించి పలు సూచనలు చేశారు. మాస్టర్ ప్లాన్ లోని లోపాలను సరిచేయాలని సూచిస్తూ వినతులు అందజేశారు. వీరితో పాటు వీఎంఆర్డీఏ పరిధిలోని ప్రజలు, పలు సంస్థల ప్రతినిధులు, పలు రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు వినతులు అందజేశారు. వీటిని పరిశీలించి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ , కమిషనర్ కె.ఎస్. విశ్వనాధన్ తెలిపారు. ముఖ్యమైన వినతులు.. రుషికొండ సర్వే నెంబర్ 25లో ఏ1 గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ప్రతిపాదిత 60 మీటర్ల రహదారి విభాగిని నుండి ఇరువైపులా 30 మీటర్లు ఉండే విధంగా మాత్రమే అలైన్మెంట్ ఉండాలని స్థానిక స్థల యజమానులు కోరారు. దసపల్లా హిల్స్ సర్వే నెంబర్ 1196 లో నౌరోజీ రోడ్ నుంచి వాల్తేరు మెయిన్ రోడ్డు కి కలిపే రహదారి విస్తరణ ప్రస్తుతం నిలిపివేయాలని దసపల్లా హిల్స్ లే అవుట్ స్థలాల యజమానులు కోరారు నిడిగట్టు గ్రామంలో ప్రతిపాదిత 24 మీటర్ల రహదారి నిర్మాణం వద్దని స్థానిక రైతులు, గ్రామస్తులు కోరారు. నేరెళ్ళ వలస రెవెన్యూ గ్రామంలో ఎస్ఓఎస్ వద్ద ప్రతిపాదిత 70 మీటర్ల రహదారి అలైన్మెంటును మార్పు చేయాలని స్థానిక మధ్యతరగతి స్థల యజమానులు కోరారు. సర్వే నెంబర్ 337, 407 మధురవాడ గ్రామంలో రామానాయుడు స్టూడియో సమీపంలోని జర్నలిస్టుల లే అవుట్ మీదుగా ప్రతిపాదించిన 18 మీటర్ల రహదారిని తొలగించాలని సంఘ ప్రతినిధులు కోరారు. సర్వే నెంబర్ 101(రుషికొండ) లో 33 అడుగుల ప్రతిపాదిత గ్రీన్ బెల్ట్ ను తొలగించాలని ఎన్ ఆర్ ఐ వ్యాపారవేత్త విజ్ఞప్తి చేశారు. మధురవాడ సర్వే నెంబర్ 374/1, ఎల్ పి నెంబర్ 74/88 లో ప్రతిపాదిత 60 అడుగులు రహదారి స్థానంలో40 అడుగుల రహదారిని కొనసాగించాలని స్థానికులు కోరారు. హనుమంతువాక నుంచి జోడుగుళ్లపాలెం వరకు ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు పరిమితం చేయాలని స్థానిక గృహ యజమానులు కోరారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు నుంచి రైల్వే న్యూ కాలనీ వరకు గల ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు పరిమితం చేయాలని పలువురు స్థానిక వ్యాపారులు నుంచి వినతి పత్రం సమర్పించారు. సర్వే నెంబర్ 76/5 గుడిలోవ పరిధిని ఎకో జోన్ నుంచి నివాస జోన్ గా మార్పు చేయాలని స్థానికులు కోరారు. లంకలపాలెం నుంచి షీలా నగర్ వరకు ప్రతిపాదించిన 80 మీటర్ల రహదారి స్థానంలో 60 మీటర్ల రహదారిని కొనసాగించాలని కార్పొరేటర్ స్టాలిన్ వినతి పత్రం సమర్పించారు. భూలోకమాత ఆలయం వద్ద

రహదారి విస్తరణ ప్రతిపాదనను విరమించుకోవాలని గ్రామ ప్రజలతో కలిసి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. విజయనగరం, పీటీ అగ్రహారం సర్వే నెంబరు 115, 116 గుండా ప్రతిపాదించిన 60 అడుగుల రహదారిని తొలగించాలని స్థానికులు కోరారు. మధురవాడ వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ ప్రక్కన ప్రస్తుతం ఉన్న 60 అడుగుల రహదారిని 100 అడుగుల వెడల్పు రహదారిగా చేసిన ప్రతిపాదనలను పునః పరిశీలించాలని స్థానిక పోతినమల్లయ్యపాలెం గృహ యజమానులు విజ్ఞప్తి చేశారు. వేపగుంట, పినగాడి రహదారిని నిర్మించేందుకు సత్వరమే చర్యలు తీసుకున్న నేపథ్యంలో చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కె ఎస్ విశ్వనాథన్ లను గ్రామస్తులు, మాజీ సర్పంచ్ బైలపూడి జయరామ్ అభినందించారు.

రేవిడి పంచాయితీలో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పద్మనాభం : అభివృద్ధి పరంగా అట్టడుగు స్థాయికి దిగజారిన రాష్ట్రాన్ని ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బుధవారం పద్మనాభం మండలం రేవిడిలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి అనేక దిగ్గజ కంపెనీలు క్యూ కడుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ చొరవ కారణంగా విశాఖలో టీసీఎస్.. గూగుల్.. కాంగ్నిజెంట్.. సత్వా.. వంటి కంపెనీలు ఏర్పాటు కానున్నాయన్నారు. అలాగే వైసీపీని మించి సంక్షేమాన్ని అమలు చేస్తూ.. ప్రజల మన్ననలు పొందామని తెలిపారు. 42 లక్షల మందికి అమ్మఒడి ఇవ్వగా, అంతకంటే 60 శాతం ఎక్కువగా 67 లక్షల మందికి తల్లికి వందనం అందిస్తున్నామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ లు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు తీరును వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో రామాలయం ఉత్సవాల్లో పాల్గొని, అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ. ఎం.విజయ్ కుమార్, కూటమి నాయకులు కోరాడ రమణ, కనిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, కురుమిన లీలావతి, మజ్జి నందీశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ, పాంద్రంగి రామరాజు, బి.ఆర్.బి. నాయుడు, చందక అప్పలరాజు, గంగరాజు, అప్పలనాయుడు, కే.సురేష్ తదితరులు పాల్గొన్నారు.